● నస్రూల్లాబాద్ సహకార బ్యాంకు



ఇదెక్కడి సహకారం!?

» రుణ బకాయి వసూళ్లకు.. జప్తు బాటలో సహకార బ్యాంకులు » రుణాలు కట్టని రైతు భూమి వేలం » రైతుల భూముల్లో వేలానికి ఫ్లెక్సీల ఏర్పాటు » రైతుల నుంచి బలవంతపు వసూళ్లు

» నెలవారీ వసూళ్లలో బ్యాంకర్ల నిర్లక్ష్యం » వడ్డీ పెరిగిన తర్వాతే.. వసూళ్లకు ఒత్తిడి

» రుణాలు తీసుకున్న రైతులకు లీగల్ నోటీసులు » కట్టకపోతే ఆస్తుల జప్తుకు చర్యలు

» కో ఆపరేటివ్ బ్యాంకర్ల తీరుపై అన్నదాతల మండిపాటు

కామారెడ్డి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నస్రూల్లాబాద్ మండలం దుర్కి కోఆపరేటివ్ బ్యాంకులో రుణం తీసుకున్న అనుషబాయి సకాలంలో రుణం చెల్లింపు చేయకపోవడంతో సదరు మహిళా రైతు భూమిని వేలం వేస్తున్నట్లు కోఆపరేటివ్ నిర్వాహకులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.. గత ఏడాది కిందట లింగంపేట మండలంలోని పొల్కంపేటలో ఓ రైతు లింగంపేట సొసైటీ బ్యాంకు నుంచి రుణం తీసుకుని కట్టకపోవడం వల్ల బ్యాంకు నిర్వాహకులు సదరు రైతు భూమిని అమ్మకానికి పెడుతున్నామని ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో తీవ్ర వివాదం నెలకొంది. ఇలా పేరుకు సహకార బ్యాంకులు అయినా.. రైతుల పాలిట యమపాశంగా వ్యవహరిస్తున్నట్లు అపవాదు వస్తోంది. జిల్లాలో రైతులకు ఇచ్చిన పంట, దీర్ఘకాలిక రుణాల రికవరీలో ఇటీవల సహకార బ్యాంకుల అధికారులు, సిబ్బంది దూకుడుగా వ్యవహరిస్తుండడం రైతులు, రైతు సంఘాలలో చర్చనీయాంశంగా మారింది. రుణం తీసుకునే సమయంలో రైతులు వ్యవసాయ భూమి పట్టా పాసుపుస్తకాలు, అవి లేనిపక్షంలో షూరిటి కింద నగలు, భూముల మార్టిగేజ్ చేయించుకుంటున్నారు. రుణం కట్టనప్పుడు నిబంధన ల ప్రకారం రైతులకు నోటీసులు ఇవ్వడం, లేదంటే వసూళ్లలో తాకట్టు పెట్టుకున్న వాటిని పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఇళ్లకు వెళ్లి సామగ్రిని సహకార సంఘాల నిర్వాహకులు జప్తు చేసేవారు. ప్రస్తుతం తాకట్టు పెట్టిన భూములను వేలం వేసేందుకు సహకార బ్యాంకు నిర్వాహకులు చర్యలు తీసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సహకారం మాట అటుంచి.. ప్రైవేట్ మైక్రోఫైనాన్స్ సంస్థల వలే కో ఆపరేటివ్ సిబ్బంది వ్యవహరిస్తున్నారని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

జిల్లాలో 29 సహకార బ్యాంకులు

నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఉండే ఎన్‌డీసీసీబీ బ్యాంకు ఉమ్మడి జిల్లాగానే ఉంది. ఈ బ్యాంక్ పరిధిలో ఇరుజిల్లాలో మొత్తం 92 సహకార బ్యాంకులు ఉన్నాయి. అయితే, కామారెడ్డి జిల్లాలో సుమారు 2,807 మంది కిపైగా రైతులు పంట రుణాలు దీర్ఘకాలిక రుణాలు, ఇతరత్రా పర్సనల్ లోన్‌లు తీసుకుని బకాయిలు ఉన్నట్లు తెలుస్తుంది. జిల్లాలో మొత్తం 29 కో ఆపరేటివ్ బ్యాంకులు ఉన్నాయి. ఈ బ్యాంకుల పరిధిలో 2,807 మందికి పైగా రైతులు రూ.కోట్లలోనే రుణాల బకాయిలు ఉన్నట్లు సంబంధిత శాఖల అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

వాయిదా వసూళ్లలో నిర్లక్ష్యం

ఉమ్మడి ఎన్‌డీసీసీబీ బ్యాంక్ పరిధిలో కామారెడ్డి జిల్లాలో 29 కో ఆపరేటివ్ బ్యాంకులు ఉన్నాయి. ఈ బ్యాంకులు రైతులకు అండగా ఉండాలి. ఈ బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు, దీర్ఘకాలిక రుణాలతో పాటు ఇతరత్రా రుణాలను కూడా అందజేస్తారు. ఈ రుణాల పరంగా క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రధానంగా రుణం ఇచ్చిన తర్వాత నిరంతరంగా రైతులను కలిసి నెలవారి వాయిదా కట్టేలా చూడాల్సిన అధికారులు.. ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదంటున్నారు. దీంతో రైతుల్లో నిర్లక్ష్యం నెలకొని అప్పు చెల్లించడం లేదు. నెలవారి కిస్తులు వసూలు చేసే రైతులపై వడ్డీభారం పడే పరిస్థితి ఉండదు. బ్యాంకర్ల ఉదాసీనత వెనుక వడ్డీ అనే తిరకాసు దాగి ఉందనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తం అవుతోంది. ఏళ్లు గడిచిన తర్వాత రుణబకాయి

(తరువాయి 8వ పేజీలో...)



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేంద్ర హోం మంత్రి రాజీనామా చేయాలి

● డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కించపరచడంతో పాటు ప్రతిపక్షాలను తక్కువచేసే విధంగా వ్యవహరించిన కేంద్రహోంశాఖమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ అన్నారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలోని రైల్వే కమాన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను అవమానిస్తే ఆయనకు మద్దతుగా ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌లు పోస్టులు పెట్టడం బాధాకరమన్నారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని తెలిపారు. ఇందులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియచంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు కన్నయ్య, తదితరులున్నారు

● షా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

ఎల్లారెడ్డి(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను భేషరతుగా వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. మంగళవారం పార్టీ ఆదేశాల మేరకు పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నియోజకవర్గంలోని అన్ని మండలాల కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానిస్తే కాంగ్రెస్ పార్టీ సహించబోదని బిజెపి మత రాజకీయాలు తప్ప అభివృద్ధి పైన ఎప్పుడు కూడా దృష్టి పెట్టలేదని క్షమాపణ చెప్పకుంటే నిరసనలు మరింత తీవ్రతరం అవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు కురుమ సాయిబాబా, బుర్ర నారా గౌడ్, పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు రజిత రెడ్డి, పరమేశ్వర్, మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.



బాయంపల్లిలో చేపల దాణా యంత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి : కలెక్టర్

లింగంపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలు ప్రభుత్వ సహకారంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మండలంలోని బాయంపల్లిలో డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన చేపల చెరువును, చేపల పెంపకానికి దాణా తయారీ యూనిట్లను, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం యూనిట్లను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. గ్రామానికి చెందిన కుంట యశోద అనే మహిళకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రూ.3.50 లక్షల రుణం మంజూరు చేయగా.. వారు చేపల పెంపకం, చేపల దాణా తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ మహిళలకు ప్రభుత్వ చేస్తున్న ఆర్థిక సహాయాన్ని ఇలా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆయన తెలిపారు. చేపల పెంపకం దారులకు మా ర్కెటింగ్ సౌకర్యం కల్పించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతిని ఆదేశించారు. ఇందులో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సురేందర్, తహసీల్దార్ నరేందర్ గౌడ్, ఎంపీడీవో నరేష్, ఎస్సై సుధాకర్, ఎంపీవో మలహరి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

● ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పక్కాగా నిర్వహించాలి

ఎల్లారెడ్డి(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం మండలంలో మీసాన్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇల్లు మంజూరు చేయడానికి సర్వే చేపడుతున్నామని తెలిపారు. సొంత భూమి గల పేదల వివరాలు సేకరించి యాప్‌లో పొందుపరుస్తున్నామని తెలిపారు.



కామారెడ్డిలోని సీఎస్ఐ చర్చిని ముస్తాబ్ చేస్తున్న దృశ్యం

క్రిస్మస్ వేడుకలకు సర్వంసిద్ధం

● జిల్లాలోని ప్రధాన చర్చిలలో ప్రత్యేక ఏర్పాట్లు

● ఉదయం నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బుధవారం క్రిస్మస్ సందర్భంగా జిల్లాకేంద్రంతో పాటు ఆయా మండల కేంద్రాల్లో చర్చిలను ముస్తాబు చేశారు. చర్చిల్లో క్రైస్తవులు ఉదయాన్నే వచ్చి కుటుంబ సమేతంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఏడాదికోసారి వచ్చే క్రిస్మస్ పండుగను క్రైస్తవులు అత్యంత భక్తి, శ్రద్ధల తో ప్రత్యేక ప్రార్థనలతో సంతోషాలతో ఈ పండుగను జరుపనున్నా రు. పనులు, ఉద్యోగాల నిమిత్తం ఎక్కడికో వెళ్లిన వారు కూడా ఈ పండుగకు తమ స్వగ్రామాలకు చేరుకొని కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ వేడుకలను జరుపుకోనున్నారు. క్రిస్‌మస్ వేడుకలను ఆయా చర్చిల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూరి గుడిసె, క్రీస్తు చిన్న పిల్లాడిగా పుట్టినట్లుగా పూరిపాకలో గడిపినట్లుగా క్రైస్తవులు పూరి పాకలను ఏర్పాటు చేస్తు క్రీస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. పాస్టర్లు ప్రత్యేకంగా క్రిస్మస్ శుభాకాంక్షలను తెలపడమే కాకుండా బైబిల్‌లోని క్రిస్మస్ సూక్తులను వినిపిస్తారు. జిల్లాకేంద్రంలోని సీఎస్ఐ గ్రౌండ్ సమీపంలో ఉన్న చర్చి, రామారెడ్డి రోడ్డులో గల పిలిడెల్ఫియ చర్చి, హరిజనవాడ ప్రాంతంలోని చర్చిలు, శాబ్దిపూర్ రోడ్డులోని బైపాస్ వద్దగల చర్చిలు, జీవదాన్ హైస్కూల్, ఆసుపత్రిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. అలాగే రైల్వేస్టేషన్ సమీపంతో పాటు కొత్తబస్టాండ్, ఆయా రోడ్డులో రంగు రంగుల విద్యుత్ దీపాలతో పాటు వివిధ రకాల ప్లాస్టిక్ పూలు, అలంకర సామగ్రిని క్రిస్‌మస్ వేడుకలతో దుకాణాలు సందడిగా మారాయి. చర్చిలను రంగు రంగుల విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు.

పసుపు రైతులను మోసగించిన బీజేపీ నాయకులు

● విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ అన్వేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ అన్వేష్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): పసుపుబోర్డు తీసుకువస్తామని పసుపు రైతులను బీజేపీ ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిలు మోసం చేస్తున్నారని విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ నెల రోజుల్లో పసుపు పంట చేతికందుతుందని, బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు పసుపుబోర్డు ఊసెత్తడంలేదని, గడిచిన ఐదేళ్ల పాలనలో బాండ్‌పేపర్ రాసిచ్చిన ఎంపీ అర్వింద్ పసుపుబోర్డు కన్న స్పైసెస్ బోర్డు మిన్నఅంటూ ప్రచారం చేసుకున్నాడని, గత ఎన్నికల్లో దేశ ప్రధాని మోదీతో పసుపుబోర్డు ప్రకటన చేయించి ఏడాది గడిచిన పసుపుబోర్డు ఊసెత్తడంలేదని ఆయన ఆరోపించారు. ఒక్కో రైతు ఒక్కో ధరకు పసుపు అమ్ముకుంటున్నారని, ధర పెరిగినప్పుడు బీజేపీ నాయకులు క్షీరాభిషేకాలు చేస్తున్నారని, నష్టపోయిన రైతు గురించి ఆలోచించడం లేదని, పసుపుబోర్డు ఎక్కడ ఏర్పాటు చేస్తారో తెలియని పరిస్థితుల్లో రైతులు ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పసుపుబోర్డు ఏర్పాటు కోసం భూమి కేటాయించి నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. పసుపు రైతు నష్టపోకుండా మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, వైస్‌చైర్మన్ ఇట్టెం జీవన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, కిసాన్‌మోర్చ పట్టణ అధ్యక్షుడు బోడమీది బాల కిషన్, ప్రమోద్, బట్టు శంకర్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష

నవీపేట,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి బైక్ నడిపిన వ్యక్తికి కోర్టు రెండు రోజుల జైలుశిక్ష విధించిందని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. మండలంలోని యంచకు చెందిన కొత్తపల్లి శ్రీకాంత్ అనే యువకుడు ఈ నెల 5న నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి బైక్ నడుపుతూ వెళ్తుండగా పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడని అన్నారు. నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం అతనికి రెండు రోజుల జైలుశిక్ష విధించడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవీపేట,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌కు చెందిన చిన్నోళ్ల పోశెట్టి(48) ఈ నెల 15న చెట్టు మీది నుంచి ప్రమాదవశాత్తు పడిపోవడంతో తీవ్రంగా గాయపడిన ఆయన చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మృతుడు చిన్నోళ్ల పోశెట్టి మండల బీఆర్ఎస్ నాయకుడు. నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రూ.20వేలను పంపించగా స్థానిక నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. అలాగే మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు రూ.5వేల, రాంపూర్‌కు చెందిన గైని మోహన్ మరో రూ.5వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, తెడ్డు పోశెట్టి, సూరి బాబు, రమేష్ తదితరులున్నారు.

కోమన్‌పల్లిలో పేకాటరాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమన్‌పల్లి గ్రామశివారులో ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. తెలిసిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించగా ఐదుగురు పేకాటరాయుళ్లతో పాటు రూ.7040నగదు, ఐదు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు గన్నారంలో దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన

కోటగిరి,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని లింగాపూర్ పంచాయతీ పరిధిలో గల పీఎస్ఆర్ కాలనీలో బుధవారం గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ హన్మంతు తెలిపారు. గ్రామంలో పెద్ద పోచమ్మ, బారడి పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనకు ముఖ్య అతిథిగా డాక్టర్ బస్వలింగ అవదూత మహరాజ్ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో మహాపడిపూజ

బోధన్‌రూరల్,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం మహపడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురు స్వాములు, అయ్యప్ప స్వాములు స్వామియే అయ్యప్ప అంటూ భజనలు, కీర్తనాలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వాములకు భిక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, లక్ష్మీ, ఇంద్రజ, వంశీకృష్ణ చారి, లక్ష్మీ, రాజు పటేల్, గురుస్వాములు, అయ్యప్ప స్వాములు, ఆలయ వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

బుక్ ఫెయిర్ కవి సమ్మేళం

వేల్పూర్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): ఈనెల 25న హైదరాబాద్ ఎన్‌టీఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్ కవి సమ్మేళనానికి ప్రముఖ కవి, వ్యాఖ్యత తెలుగు బాష ఉపాధ్యాయుడు, తెలంగాణ రచయిత సంఘం (తెరాసం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణపురం దేవేందర్ ఎంపికయ్యారని రామన్నపేట చరిత్ర గ్రంథ రచయిత కంకణాల రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు జరిగే హైదరాబాదలో నిర్వహించనున్న ఓ కార్యక్రమంలో దేవేందర్‌కు ఘనసన్మానం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆహ్వానం రావడం పట్ల కంకణాల రాజేశ్వర్, పలువురు రచయితలు, కవులు దేవేందర్‌ను అభినందించారు.

బీజేపీ బూత్ అధ్యక్షుల ఎన్నిక

దోమకొండ,(బీబీపేట) డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట్, చింతమాన్‌పల్లి గ్రామాల్లో బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ముత్యంపేటలో 89వ బూత్‌కు దేవరాజ్, 90వ బూత్‌కు తిరుపతిరెడ్డి, 91వ బూత్‌కు బాల్‌రాజ్, చింతమాన్‌పల్లి గ్రామంలోని 87వ బూత్ అధ్యక్షులుగా జంగంపల్లి స్వామి, 88వ బూత్ అధ్యక్షులుగా సార్ల శేఖర్‌లు ఎన్నికైనట్లు కామారెడ్డి అసెంబ్లీ ఇంచార్జ్ కుంట లక్ష్మారెడ్డి తెలిపారు. అలాగే బీబీపేట మండలంలోని ఉప్పర్‌పల్లి, మాందాపూర్‌లో గ్రామాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఉప్పర్‌పల్లి గ్రామంలో 68వ బూత్ అధ్యక్షులుగా దోనేటి శేఖర్, 69వ బూత్ అధ్యక్షులుగా బాల్‌నర్సులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.మాందాపూర్‌లో 81వ బూత్‌కు చెన్నం మాల్లారెడ్డి, 82కు చింతకుంట లింగారెడ్డి, 83 కు శీలం శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదేశానుసారం అన్ని గ్రామాల్లో అధ్యక్షులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో నాయకులు నరేందర్, అంజల్‌రెడ్డి,మండలాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు నత్తి గణేష్, నాయకులు గాజులపల్లి విఠల్‌రెడ్డి, రాయపల్లి సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నందిపేటలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



నందిపేటలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



డొంకేశ్వర్‌లో ..

నందిపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్మూర్ బైపాస్ రోడ్డులో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఏఐసీసీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, నాయకులు సిలిండర్ లింగం, మజారోద్దిన్, వైఎస్ గంగాధర్, వెల్మల్ రాజేందర్, ఎడ్డిగారి నిఖిల్, తుక్కన్న, జమీల్, భూమేష్, హైమద్ తదితరులు ఉన్నారు.

డొంకేశ్వర్: భారత రాజ్యంగా నిర్మాత బీఆర్.అంబేద్కర్‌ను అవహేళన చేసి మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు అమిత్‌షా చేసిన వ్యాఖ్యాలకు నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులు అర్పించారు. హోంమంత్రిగా ఉండి చట్టాలను సక్రమంగా అమలు పర్చాల్సిన అమిత్‌షా అంబేద్కర్‌పై వ్యాఖ్యాలు చేయడం సరికాదని, వెంటనే హోంమత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దేగం గంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ సుమన్, దత్తాపూర్ లిఫ్ట్‌చైర్మన్ వెంకటరమణ, శ్యామ్‌గౌడ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దేశప్రజలకు క్షమాపణ చెప్పి ముక్కును నేలకు రాయాలని ఆర్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురకంటి చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చేపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగా నిర్మాత బీఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యాలు చేయడం సరైన పద్దతి కాదని, తన బాధ్యత మరిచి చౌకబారు మాటలు మాట్లాడడం సరికాదని, వెంటనే హోంమంత్రి పదవికి రాజీ నామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, మాజీఎంపీటీసీలు జన్నెపల్లి గంగాధర్, ఎలుక రంజిత్, సొక్కం సంజీవ్, సాయన్న, పోశెట్టి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చీలు

బోధన్‌రూరల్,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో గల సీఎస్‌ఐ చర్చితో పాటు రాకాసిపేట్‌లోని పలు చర్చిలు ముస్తాబయ్యాయి. విద్యుత్తు దీపాల కాంతులతో విరజిల్లుతున్నాయి.

● బోధన్ ఆర్టీసీ డిపోలో క్రిస్మస్ వేడుకలు

బోధన్‌రూరల్,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): బోధన్ ఆర్టీసీ డిపోలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శ్రీనివాస్ క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ విశిష్టతను వివరించారు. క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రావణ్, ఎస్‌టీఐ లక్ష్మణ్, అనంతయ్య, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపోలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ముప్కాల్: క్రైస్తవ మాత ఆరాధ్య దైవ మైన ఏసుక్రీస్తు జన్మదినం పురస్కరించుకొని క్రిస్మస్ వేడుకలను ఘనం గా క్రైస్తవ సోదరులు జరుపుకుంటున్నారు. ముప్కాల్, బాల్కొండ మండ లాల్లోని చర్చీలను రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ప్రతీ ఇంటి ముందు చర్చిలపై మిరుమిట్లు, రంగురంగుల స్టార్‌లను ఏర్పాటు చేశారు. క్రైస్తవ వేడుకల్లో ప్రధానమైన క్రిస్మస్ చెట్టును చర్చీలో అలం కరించారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంగళవారం మండలంలోని కొత్తపల్లి గ్రామాల్లో క్రైస్తవ గీతాలు అలపిస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వ హించారు. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా క్రైస్తవ గీతాలకు అను గుణంగా నృత్యాలు చేస్తూ క్రిస్మస్ తాత వేషాదారణలు చక్లెట్లు పంచారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలందరు సుఖసంతోషాలతో, ఆయురా రోగ్యాలతో ఉండాలని ఏస్తుప్రభును వేడుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కమ్మర్‌పల్లి: ఏసుక్రీస్తు జన్మదిన సందర్భంగా క్రైస్తవసోదరులు జరుపుకునే క్రిస్మస్ వేడుకలకు కమ్మర్‌పల్లి మండలంలోని క్రైస్తవసోదరులు సన్నద్ధమవుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలోని చర్చీలలో బుధవారం ఉదయం 11 గంటలనుంచి ప్రత్యేక ప్రార్థనలు ఆయా చర్చీల పాస్టర్ల అధ్వర్యంలో నిర్వహించేల ఏర్పాట్లు పూర్తి చేయగా ప్రత్యేక ప్రార్థనల కోసం చర్చీలను ముందస్తుగానే సిద్ధం చేసి ఉంచారు. క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనల నిమిత్తం ఉదయం 10 గంటలవరకు ఆయా గ్రామాల చర్చీలకు చేరుకునే విదంగా ఏర్పాట్లు చేశారు. చర్చీలవద్ద భక్తు సౌకర్యార్థం తగిన వసతులు కల్పించారు.

నవీపేట: మండలంలోని నాడాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో క్రిస్మస్ కేక్‌ను కట్ చేయించి వారికి చాక్లెట్లను అందజేశారు. అనంతరం క్రిస్మస్ వేడుకల ప్రాముఖ్యత గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ప్రసన్న, సుష్మ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత తదితరులు పాల్గొన్నారు.

జాగిర్యాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

భీమ్‌గల్‌రూరల్,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి):మండలంలోని జాగిర్యాల్ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ళ సర్వేను మంగళారం ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే సర్వే చేసి లబ్దిదారులను గుర్తించాలని తప్పులు లేకుండా సర్వేను పకడ్బందీగా చేయాలని, వివరాలు వెంటనే వెబ్‌సైట్‌లో నమోదు చేసి కుటుంబ యాజమాని ఫోటో అప్‌లోడ్ చేయాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శికి సూచించారు. గ్రామంలోని పారిశుధ్య పనులను పరిశీలించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వ అదేశాలమేరకు తప్పు లు లేకుండా ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఈ నెల 28 లోగా పూర్తి చేయాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. మంగళవార కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లి గ్రామంలో కొనసాగుతగుతున్న ఇందిరమ్మ ఇళ్ళ సర్వేను ఆయన సందర్శించి సర్వే ప్రక్రీయను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటివలనిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇడ్ల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న వారిని సర్వే చేసి అర్హులైన లబిద్దదారులుగా



జాగిర్యాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

గుర్తించాలని, వారి కుటుంబ వివరాలు, అద్దెఇల్లు, సొంత పాట్లు తదితర అంశాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని కుటుంబ యాజమాని ఫోటోనుఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని,గ్రామపంచాయ తీ కార్యదర్శి శాంతికుమార్‌కు సూచించారు. సర్వేయర్‌లు ఆర్‌ఐశరత్ ఫీల్డ్ అసిస్టెంట్ సాదుల్లా, వివోలు భాగ్యశ్రీ, వనిత, సుంకెట జ్యోతి ఉన్నారు.

మామిడిపల్లిలో గోడప్రతుల ఆవిష్కరణ

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న జిల్లా కేంద్రంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్న కృతజ్ఞత సభకు తరలిరావాలని బాష ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి.జమీల్ కోరారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కృతజ్ఞత సభ గోడప్రతులను ఆయన ఆవిష్కరించారు. గత 24ఏళ్లగా తెలుగు, హిందీ, ఉర్దూ బాష పండితుల పదోన్నతుల కల నెరవేర్చినందుకు నిర్వహిస్తున్న కృతజ్ఞత సభను బాష పండితులు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

విజయ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

మాక్లూర్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి):మండలంలోని దాస్‌నగర్ గ్రామ శివారులో గల విజయ్ కాలేజీ ఆఫ్ ఫార్మసిలో ఎటిరో డ్రాగ్స్ ఫార్మసి వారు మంగళవారం క్యాంపస్‌డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మసి రంగంలో కేరీర్‌ను ప్రారంభించాలనుకునే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఫార్మసీలో విద్యార్థుల కేరీర్ పురోగతికి సహాయపడే వాతా వరణం కల్పించడంతో అంకిత భావాన్ని ఉంచుమందాన్ని, ఎటిరో ఫార్మసీ అందించిన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, కేరీర్‌లో మెరుగైన పురోగతి సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సి పాల్ సురేష్,ఎటిరోడ్రాగ్స్ ప్రతినిధులు ప్రకాష్,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

'నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది'

బోధన్‌రూరల్,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్దరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. మంగళవారం హున్స, మందర్నా, ఖాజాపూర్ గ్రామాల రైతులతో సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు చెరకు పంట సాగుకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ నెల 28వ తేదిన ఎడపల్లి మండలం సరయు ఫంక్షన్ హాల్‌లో నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పునః ప్రారంభ సన్నాహక సమావేశం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రైతుసోదరులు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలన్నారు. సమావేశానికి హున్స, మందర్నా, ఖాజాపూర్ తదితర గ్రామాల నుండి రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మండలాల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, ఎడపల్లి మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్, సాలూర సోసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, అల్లె రమేష్, ఖాజాపూర్ అశోక్, శంకర్, చిద్రపు రాములు, రైతులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించడంలో విఫలం

భీమ్‌గల్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో సుపరిపాలన అందించడంలో విఫలమైందని ప్రతిపక్ష పార్టీలపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తుందని బీజేపీ భీమ్‌గల్ మున్సిపల్ ఇన్‌చార్జి ఆరే రవీందర్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో రవీంధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు గుప్పెడు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్కటి నెరవర్చడం లేదని, దీనిని గమనిస్తున్న ప్రజలకు ప్రతిపక్ష పార్టీలపై లేనిపోని ఆరోపణలు చేసి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు మానాల మోహన్‌రెడ్డి సినీ ఇండస్ట్రీ ఘటనపై బీజేపీ నాయకులపై చేసిన ఆరోపణలు ఖండిస్తున్నామన్నారు.ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు యోగేశ్వర నర్సయ్య, సీనియర్ నాయకులు సంధ్యరాజు, బూత్ అధ్యక్షుడు గోపు అంజి, ఉప్పల నవీన్, బండారు నరేందర్, తోపారం నరేంధర్‌తో పాటు సురేందర్, సెల్వ గంగాధర్, సెల్వ లింబాద్రి పాల్గొన్నారు.

భిక్కనూరు మండల సమాఖ్య సమావేశం


భిక్కనూరు, డిసెంబరు 24: భిక్కనూరు మండలకేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశాన్ని అధ్యక్షురాలు రాజమణి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైనా డీపీఎం సుధాకర్ మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రతిమహిళ ఎస్‌హెచ్‌జీలో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, కుటుంబ అభివృద్ధికి లోన్లు తీసుకుని క్రమం తప్పకుండా ఈఎంఐలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా సిబ్బంది సమ్మెతో నిలిచిన కార్యకలాపాలు

మద్నూర్,డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):విద్యాశాఖ అనుబంధంగాపనిచేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది సమ్మె బాట పట్టడంతో మండల విద్యాధి కార్యాలయంతో పాటు కేజీబీవీలలో ఉపాధ్యాయులు సమ్మెలో పాల్గొనడంతో విద్యా వ్యవస్థ పై ప్రభావం పడుతుంది. వారు చేపడుతున్న సమ్మె మంగళవారం నాటికి 18వరోజుకు చేరుకుంది. ఉద్యోగులందరికీ క్రమబద్ధీకరించాలని, ఇప్పటి వరకు పేస్కేల్ కల్పించాలని, రూ.10లక్షల ఆరోగ్య బీమాతో పాటు పదవీ విరమణ ప్రయోజనాల కింద రూ.25లక్షలు చెల్లించాలని తదితర డిమాం డ్లతో సమగ్ర శిక్ష ఉద్యోగ సిబ్బంది సమ్మె చేపడుతున్న విషయం విధితమే. కామా రెడ్డి జిల్లా పరిధిలో725 మంది సర్వశిక్ష ఉద్యోగులు ఉన్నారు.వీరిసమ్మెతో కస్తూర్బాలో విద్యా బోధనకు ఆటకం ఏర్పడింది. సిబ్బంది సమ్మెలో ఉండడంతో ఎంఈవో కార్యాలయానికి తాళం వేయబడి బోసిపోయింది.విద్యాపాలన స్తంభించింది.

● నిలిచిపోయిన కార్యకలాపాలు, బోధన

మండల విద్యాధికారి కార్యాలయంలో సీఆర్పీలు, సాంకేతిక సహాయకులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఆర్‌పిలు సమ్మె కారణంగా అందుబాటులో లేకపోవడంతో డ్రెసులు, మధ్యాహ్న భోజన బిల్లులు, వివిధ రకాల పనులు నిలిచిపోయాయి. కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో పనిచేసే సిఆర్‌టిలు(టీచింగ్), నాన్ టీచింగ్ సిబ్బంది సమ్మె బాట పట్టడంతో కార్యకలాపాలు, విద్యా బోధన నిలిచిపోయింది. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు బోధనతో పాటు నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు శిక్షణ ఇచ్చే



మద్నూర్ ఎంఈవో కార్యాలయానికి తాళం

క్రాఫ్ట్, ఆర్ట్, డ్రాయింగ్ ప్రత్యేక ఉపాధ్యాయులు సైతం సమ్మెలో ఉండడంతో ఆ విద్య కూడా అందకుండా పోయింది.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె చేస్తాం. గతంలో 2023 ఆగస్టు, సెప్టెంబర్ నెలలో సుమారు 25 రోజులు సమ్మె చేయ గా అప్పుడు కాంగ్రెస్ తరపున రేవంత్ రెడ్డి ధర్నాకు మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలి. న్యాయమైన సమస్యలు నెరవేర్చాలి.

- సత్యనారాయణ, జిల్లా ఎస్ఎస్ఏ అధ్యక్షుడు

మోర్తాడ్ జూనియర్ కళాశాల సందర్శన



మోర్తాడ్ జూనియర్ కళాశాలో లెక్చరర్‌లతో మాట్లాడుతున్న డీఐఈవో

మోర్తాడ్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో రవికుమార్ ఆకస్మికంగా సందర్శించారు. మంగళవారం ఆయన లెక్చరర్‌లలో మాట్లాడుతూ త్వరగా సెలబస్ పూర్తి చేసుకొని విద్యార్థులకు స్టడీ అవర్స్ తీసుకోవాలని అన్నారు. అంతేగాక స్పెషల్ క్లాసులు తీసుకోవాలని, లాంగ్ ఆప్‌సెంట్ పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు చెప్పి రెగ్యులర్‌గా కళాశాలకు వచ్చే విధంగా చూడాలని సూచించారు. అనంతరం కళాశాలను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్‌లు లక్ష్మీనారాయణ, జలపతి, లెక్చరర్‌ల బృందం పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో విగ్రహ పున: ప్రతిష్టాపన

బోధన్‌రూరల్,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం ఊట్‌పల్లి గ్రామంలో మంగళవారం నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో హనుమంతుడి విగ్రహ పున:ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో హనుమాన్ విగ్రహన్ని పుర వీధుల గుండా ఊరేగించారు. ఆయా కాలనీలోని మహిళలు రథం ముందు ఆచారం ప్రకారం నీళ్లు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహ పున:ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా, పారాయణంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హనుమాన్ విగ్రహ ఊరేగింపు దృశ్యం

ఆర్థిక సహాయం అందజేత



ఆసుపత్రిలో తోటి మిత్రుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రులు

మెండోర, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): తోటి మిత్రుడు తనతో చదువుకునే మిత్రుడు రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న మిత్రులు ఆసుపత్రిలో చికిత్స కోసం అధిక మొత్తంలో ఖర్చు అవుతున్న విషయాన్ని తెలుసుకున్న మిత్రులు ఆసుపత్రికి వెళ్ళి ఆర్థిక సహాయం చేసి వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వివరాల్లోకి వెళ్ళితే కోడిచర్ల గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఇటీవల కోడిచర్ల, చాకిర్యాల్ గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో నిర్మల్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పదో తరగత 2023- 24 పూర్వ విద్యార్థులు రూ.70వేల ఆర్థిక సహాయం చేసి మా నవ దృక్పథం చేశారు.ఈకార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

మాక్లూర్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మానిక్‌బండార్ గ్రామానికి చెందిన నీలం రాజు(26) అనే యువకుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడు నీలం రాజు చెడు అలవాట్లకు బానిసై ఇంట్లో బంగారం అమ్మడానికి ప్రయత్నించడంతో భార్య నిరకరించడంతో తీవ్ర మనస్థాపం చెందిన మంగళవారం దాస్‌నగర్ శివారులో వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి వెళ్ళి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రం ఆసుపత్రికి తరలించామని అయన తెలిపారు. మృతుని భార్య రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఆంజనేయ ఆలయ ఉత్సవాలు ప్రారంభం

నవీపేట,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి):మండలంలోని నాగేపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా మొదటి రోజైన మంగళవారం ధ్వజారోహణం, గణపతి పూజ, పుణ్యావాచనం, గోపూజ, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, జలాధివాసము, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు.

వేల్పూర్ ఎస్సైగా సంజీవ్

వేల్పూర్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మం డల నూతన ఎస్సైగా బి.సంజీవ్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి ఇక్కడ ఎస్సైగా చేసిన నాగనాథ్ ఆదిలాబాద్ జిల్లా బదిలీ పై వెళ్లారు దీంతో నిజామాబాద్ ట్రాఫిక్ ఎస్సైగా ఉన్న సంజీవ్‌ను వేల్పూర్ ఎస్సైగా సీపీ సింధూశర్మ నియ మిం చారు.

బీడీకార్మికులకు జీవనభృతి ఇవ్వాలని వినతి

ముప్కాల్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బీడీకార్మికులు ర్యాలీగా వెళ్లి ఎంపీడీవో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెళ్ళి బీడీ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు రూ.4016 జీవన భృతి ఇవ్వాలని, తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీకార్మికులకు పరిశ్రమలపై జీవనం కొనసాగిస్తున్నారని, గత కొన్ని రోజులుగా పరిశ్రమను దెబ్బతీసే విధంగా నాలు గు లెబర్‌కోడ్‌లను తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముత్తెన్న, ఎండి.నజీర్, తుర్పటి శ్రీనివాస్, నిఖిల్, రిషిత, అనుష, బీడీకార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

రామస్వామినాయక్ వర్ధంతి వేడుకలు

వేల్పూర్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బేరియర్ రామస్వామి నాయక్ 51వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ప్రధానకార్యర్శి బాబురావు, సలహాదారులు బండి విజయ్, గంగారాం, దార్ల వినోద్, కవిత, మణిక్‌రావు, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

పచ్చలనడ్కుడలో భక్తిశ్రద్ధలతో బోనాలు

వేల్పూర్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి):మండలం పచ్చలనడ్కుడ గ్రా మంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెద్దమ్మతల్లి ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లి బోనాలు ఎదుర్కొలుగా తీసు కువచ్చి సమర్పించారు. ముదిరాజ్‌లు ఇంటికో బోనం చొప్పున మహిళలు ఎత్తు కొని మంగళహారతులు, డప్పువాయిద్యాలతో ఆలయం వరకు ఎదుర్కొ న్నారు. అంతకు ముందు పెద్దమ్మతల్లి ఆలయం వద్ద మహిళలు కుంకుమార్చన నిర్వహించారు.



పచ్చలనడ్కుడలో పెద్దమ్మతల్లికి బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



నగరంలో విద్యుత్‌కాంతులతో వెలుగుతున్న సీఎస్ఐ చర్చీ



విద్యుత్ దీపాలతో

వెలిగిపోతున్న చర్చీలు

● సర్వాంగసుందరంగా చర్చీలు ● అర్ధరాత్రి నుంచే క్రిస్మస్ వేడుకలు ● మార్కెట్‌లో క్రిస్మస్ సందడి

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్లు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే క్రిస్మస్ వేడుకలను చర్చీలు సర్వాంగసుందరంగా మారాయి. జిల్లావ్యాప్తంగా ప్రధానచర్చీలతోపాటు గ్రామాల్లోని చర్చీలు క్రిస్మస్ వేడుకలకు సిద్ధమయ్యాయి. క్రిస్మస్ పర్వాదినాన్ని పురస్కరించుకుని క్రిస్టియన్లు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. చర్చిల్లో అర్ధరాత్రి నుంచే వేడుకలు ప్రారంభం కానున్నడంతో చర్చీలు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. చర్చీ ప్రాంగణంలో ఏసు జననానికి సంబంధించిన పశువుల పాకను ఏర్పాటుచేశారు. ఏసు అర్ధరాత్రి తర్వాత జన్మించాడని ఆధారాలు ఉండడంతో జన్మదిన వేడుకలతోపాటు ప్రత్యేక ప్రార్థణలు నిర్వహించనున్నారు.

● ప్రత్యేక పాక ఏర్పాటు

ఏసు జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే వేడుకలకు చర్చీ ఆవరణల్లో ప్రత్యేక పశువులపాకను ఏర్పాటు చేశారు. ఏసుప్రభు జన్మించే సమయంలో ఎలాంటి సదుపాయాలు లేకపోవడంతో దైవదూతగా జన్మించిన ఏసు నాటి పశువుల కాపరులు బాలుడ్ని పశువులపాకలో ఉంచి ఆలానపాలన చేసినట్లు చరిత్ర చెబుతోంది. దీంతో ఏసుప్రభు జన్మస్థలంగా భావించే పశువులపాకలో బాల ఏసును ఉంచి జన్మదిన వేడుకలు నిర్వహిస్తారు. ఏసు ప్రభు జన్మించిన రోజును ఎంతో సంబురంగా క్రిస్టియన్లు భావించి దైవదూతకు ప్రత్యేక ప్రార్థణలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

మార్కెట్ సందడి

క్రిస్మస్ పండుగతో మార్కెట్ సందడి వాతవరణం నెలకొంది. క్రిస్మస్ పండుగకు కావలసిన వస్తువుల కొనుగోళ్లతో ప్రధాన మార్కెట్‌లు రద్దీగా మారాయి.

ముస్తాబైన ధర్మారం(బీ) క్యాథలిక్ చర్చీ

డిచ్‌పల్లి: జిల్లాలోని అతిపెద్ద క్యాథలిక్ చర్చీ డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బీ) గ్రామంలో చర్చీ నిర్వాహకులు రంగురంగుల విద్యుత్‌దీపాలతో నేడు (బుధవారం) జరిగే క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ముస్తాబు చేశారు.

పండుగ సంబురం



చర్చీలోపల
వెలుపల
ఏసు జన్మించిన
పశువుల కొట్టాలను
తీర్చిదిద్ది అందులో విగ్రహాలు ఏర్పాటు చేయించారు. చర్చీకి నలువైపుల స్టార్ చుక్కలను విద్యుత్ దీపాలతో అలంకరింప జేశారు. డిచ్‌పల్లి క్రిస్టియన్ మెడికల్ కళాశాలలో ఉన్న చర్చీతోపాటు ధర్మారం, బర్ధిపూర్, నడిపల్లి, ఏడో పోలీస్ పటాలము, రాంపూర్, మిట్టపల్లి, దూస్‌గాం, కమలాపూర్, ముల్లంగిలలో చర్చీలను విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

నిర్మల హృదయ పాఠశాలలో ఏసు పుట్టుకను తెలియజేసే బొమ్మల ప్రదర్శన







సీఎస్ఐ చర్చీలో వేడుకల కోసం ఏర్పాటు చేసిన హాల్



సీఎస్ఐ చర్చీలో ప్రార్థన కోసం..



ఏర్పాటుచేసిన క్రిస్మస్‌ట్రీ



కానుకలను గుర్రంపై తెస్తున్నట్లు సంతాక్లాజ్ బొమ్మ



ఏర్గట్లలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్

మరమ్మతులకు నోచుకోని ఏర్గట్ల బస్టాండ్

● బస్టాండ్ ఉన్నా.. ప్రయోజనం సున్నా!

● ఏళ్లుగా నిరుపయోగం ● దెబ్బతిన్న మరుగుదొడ్లు

ఏర్గట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రయాణీకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్టాండ్ మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారింది. ఏర్గట్ల మండల కేంద్రంగా ఏర్పడక ముందు నుంచే ఉన్న బస్టాండ్ నేడు మండలంగా ఏర్పాటైనా కూడా మరమ్మతులకు నోటుకోవడం లేదు. అప్పట్లో జీపీ నిధులతో నిర్మించిన బస్టాండ్ కావడంతో దాని పర్యవేక్షణ జీపి నిర్వహిచాల్సి ఉన్నా ప్రయాణికులు మాత్రం బస్టాండ్‌ను ఉపయోగించే పరిస్థితులు లేకపోలేదు. మండలంలోని ఏడు గ్రామాలకు మధ్యలో ఉన్న ఏర్గట్లలో నిత్యం ప్రయాణీకులు ఆర్మూర్‌తోపాటు జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి రాకపోకలు చేస్తుంటారు. ప్రతీ మంగళవారం నిర్వహించే అంగడికి, అలాగే ప్రతీరోజు ప్రభుత్వ కార్యాలయాలకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు వస్తూ పోతూ ఉంటారు. అయితే బస్టాండ్ నిరూపయోగకరంగా ఉండటం మరుగు దొడ్డు, మూత్రశాలలు పూర్తిగా ధ్వంసం కావడంతో బస్టాండ్ వైపు వెళ్లడం లేదు. 2014లో అప్పటి ప్రజా ప్రతినిధులు 13వ ఫైనాన్స్ జీపీ నిధులతో రూ.2.80 లక్షలతో మూత్రశాలలు, మరుగుదొడ్ల మరమతులు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ మరమ్మతులు చేసి పదేళ్ళు గడుస్తోంది. అప్పటి నుంచి మళ్లీ బస్టాండ్ నిరుపయోగంగా మారి బస్టాండ్‌ను వాడుకోవడంలేదు. ఇప్పటికైనా బస్టాండ్‌లో మరమ్మతులుచేసి బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

బస్టాండ్‌లో మరమ్మతులు చేపట్టాలి



● అట్ల పోశయ్య, గ్రామస్తుడు

మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మర్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకురావాలి. బస్టాండ్ నిరుపయోగంగా ఉండటంతో మండలానికి వచ్చే ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలి.



వేదికపై అవార్డు అందుకుంటున్న భవిష్య

నాట్యంలో భవిష్యకు బాలపురస్కారం

● తిరుపతిలో అమృతపూర్ విద్యార్థిని నాట్య ప్రదర్శన

● అభినందించిన గ్రామస్థులు

డిచ్‌పల్లి, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమృతపూర్‌కి చెందిన కొట్టల భవిష్యకు శ్రీకృష్ణ నాట్యమని బాలపురస్కారం లభించింది. మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో శ్రీకృష్ణ నటరాజాలయం కల్చరల్ డెలప్‌మెంట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ కల్చరల్ డ్యాన్స్ ఫెస్టివల్‌లో ప్రతిభ చూపి అందరి మందనలు పొందింది. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన డ్యాన్స్ పోటీల్లో భవ్య పాల్గొనుంది. చదువుతోపాటు నాట్యంలో రాణిస్తున్న ఈ చిన్నారిని గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

అద్దె భవనంలో తపాలా శాఖలు

● వేధిస్తున్న సిబ్బంది కొరత ● ఇబ్బందుల్లో ఇందల్వాయి మండల ప్రజలు

ఇందల్వాయి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ తపాలశాఖలో సిబ్బంది కొరత వేధిస్తుంది. అన్నితపాల శాఖలు ప్రస్తుతం అద్దెభవనంలోనే కొనసాగుతున్నాయి. ఇందల్వాయి మండలంలో మొత్తం 23 గ్రామపంచాయతీలు ఉండగా దీంతోపాటు డిచ్‌పల్లి మండలానికి చెందిన రాంపూర్, రామడుగు, సుద్దులం గ్రామాలు ఇందల్వాయి తపాల శాఖ పరిధిలోకి వస్తాయి. మొత్తం మండలంలో 13 తపాల శాఖలు ఉన్నాయి. ఈ 13 గ్రామాల్లో బ్రాంచ్ మేనేజర్‌లు పనిచేస్తున్నారు. మేజర్ గ్రామపంచాయతీల్లో అసిస్టెంట్ బిపిఎంలు లేకపోవడంతో పలు జాప్యం జరుగుతోంది. పెన్షన్‌దారులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఉత్తరాలు, ఇతర ధృవపత్రాలు ప్రజలకు సరైన సమయంలో అందక ఇబ్బందులు పడుతున్నారు.

● వేధిస్తున్న సిబ్బంది కొరత

మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీలు ఇందల్వాయి, గన్నారం, నల్లవెల్లి, రాంపూర్, తదితర గ్రామాల్లో తపాల శాఖ కింద నాలుగు నుంచి ఐదు గ్రామాలు ఉన్నాయి. దీంతో మేజర్ గ్రామ పంచాయతీ తపాల శాఖలో ఏబీపీఎంలు లేకపోవడంతో బీపీఎం ఒక్కరే విధుల్లో ఉండటంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. పోస్టాఫీసు ద్వారా ఉపాధి కూలీల డబ్బులు, వృద్ధుల పెన్షన్, పోస్టుపేమెంట్ బ్యాంక్ అకౌంట్లు, ఇన్సూరెన్స్‌లు, తదితర పనులు చేయాల్సి ఉంటుంది. ఈ పనులన్నింటిని సకాలంలో చేయాలంటే మేజర్ గ్రామపంచాయతీల్లో బీపీఎంతోపాటు బీపీఎంలను నియమించాలి. కానీ అసిస్టెంట్ బిపిఎంలు లేకపోవడంతో పనిభారం పెరిగి బీపీఎంలు ఏం చేయాలో తెలియక ఏ గ్రామానికి వెళ్లాలో తెలియక ఉద్యోగులు సతమతమవుతున్నారు. సిబ్బంది కొరత ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు సరైన సమయంలో ప్రజలకు అందడం లేదు.

● అన్ని కార్యాలయాలు అద్దె భవనంలో..

మండలంలో ఉన్న 13 పోస్టాఫీసులు ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. తిర్మన్‌పల్లికి గతంలో నిధులు మంజూరైనా నేటి వరకు పనులు జరగడం లేదు. పోస్టాఫీసుకు వచ్చే ప్రజలు, వృద్ధులు గంటల తరబడి నిలబడి తమ పనులు చేసుకుంటున్నారు. మహిళలకు మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.



జర దేఖో!!

కనీస వసతులు కల్పించాలి



● దామ సుమన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

పోస్టాఫీసుల్లో సిబ్బందిని నియమించాలి. కనీస సౌకర్యాలు లేక వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. సొంతభవనాల నిర్మాణం, మేజర్‌జీ పీల్లో అసిస్టెంట్ బీపీఎం లను నియమిస్తే సమస్యలు తీరే అవకాశం ఉంది.

ఎండలో నిలబడుతున్నాం..

● ఒడ్డె పోశవ్వ



ప్రతీనెల పింఛన్ కోసం గంటల తరబడి ఎండలో నిలబడి పింఛన్ తీసుకుంటున్నా. వృద్ధులకు చాలా ఇబ్బంది ఉంది. మూత్రశాలలు లేవు. ప్రభుత్వం స్పందించాలి.

ప్రభుత్వానికి నివేదిక పంపించాం: సృజన్, మేనేజర్, ఇందల్వాయి

కొన్ని గ్రామాల్లో పోస్టాఫీసులు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మరికొన్ని గ్రా మాల్లో గ్రామ పంచాయతీ భవనాల్లో నడుస్తున్నాయి. మేజర్ గ్రామ పంచా యతీల్లో పని ఒత్తిడిని బట్టి అసిస్టెంట్ బిపిఎంలు కావాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. పోస్టులు మంజూరైన నియామకాలు చేపడుతాం.

మనఊరు-మనబడి పనులకు గ్రహణం!

● బిల్లులు రాక పాఠశాలల నిర్మాణాలకు బ్రేక్ ● అసంపూర్తిగా పాఠశాలల నిర్మాణాలు ● చేసిన పనులకు బిల్లులు మంజూరు అయ్యేదెప్పుడో? ● ఆర్థిక ఇబ్బందుల్లో పడుతున్న కాంట్రాక్టర్లు



నిలిచిన గోపాల్‌పేట్ పాఠశాల భవన నిర్మాణ పనులు

ఆంధ్రజ్యోతి పరిశీలన



● మధ్యలో నిలిచిన తాండూర్ పాఠశాల భవన నిర్మాణం పనులు



గోపాల్‌పేట్ హైస్కూల్ భవన నిర్మాణం పనులకు మాజీ ఎమ్మెల్యే సురేందర్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం

నాగిరెడ్డిపేట, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాలలోని పాఠశాలలకు మన ఊరు - మన బడి పథకం ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు గదుల భవన నిర్మాణం పనులు, పాఠశాలల మరమ్మతు పనులు పూర్తికాక గ్రహణం పట్టింది. బిల్లులు రాక మధ్యలోనే పనులకు బ్రేక్ పడింది. దీంతో ఈ పాఠశాలల భవన నిర్మాణం పనులు ఎప్పటికీ పూర్తవుతాయోనని విద్యార్థులు, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మనఊరు - మనబడి పథకం ద్వారా మంజూరైన అదనపు గదుల నిర్మాణం, వివిధ మరమ్మతు పనులు చేసిన వాటికి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను అర్థాంతరంగా మధ్యలోనే నిలిపేశారు. చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తే మిగతా పనులు ఎప్పుడో పూర్తయ్యేవి. ప్రభుత్వం బిల్లులు ఇవ్వక పోవడంతో ఆయా పాఠశాలల అదనపు గదుల నిర్మాణాలు ఎక్కడికక్కడే ఏడాది కాలంగా అర్థాంతరంగా నిలిచిపోయాయి. చేసిన పనులకు ఏడాది గడిచినా బిల్లులు రాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్‌లు లబోదిబో మంటున్నారు. మండల కేంద్రంలోని గోపాల్ పేట్ హైస్కూల్‌కు 2022-23 సంవత్సరంలో ఒక కోటి ఆరు లక్షల రూపాయల వ్యయంతో 6 అదనపు గదులతో పాటు డైనింగ్ హాల్‌తో భవన నిర్మాణం కోసం, పాఠశాల మేజర్, మైనర్ మరమ్మతు పనులు మంజూరైయ్యాయి. ఈ పనులను చేపట్టిన కాంట్రాక్టర్ అదనపు గదుల భవన నిర్మాణం పనులు స్లాబ్ వరకు పూర్తి చేశాడు. పాఠశాల భవన నిర్మాణం పనులు సగం వరకు పూర్తి కాగా, జరిగిన పనులకు సుమారు 50 లక్షల రూపాయలు రావల్సి ఉండగా, ఒక్క రూపాయి బిల్లు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపేశాడు. తాండూర్ హైస్కూల్‌కు 8 అదనపు గదులు, ఒక డైనింగ్ హాల్‌తో భవన నిర్మాణం, పాఠశాల మరమ్మత్తుల కోసం 2022-23లో ఒక కోటి నాలుగు లక్షల రూపాయల వ్యయంతో మంజూరైయ్యాయి. పాఠశాల అదనపు గదుల నిర్మాణం పనులను స్లాబ్ లెవల్ వరకు పూర్తి చేశాడు. జరిగిన పనులకు సుమారు 46 లక్షల రూపాయలు బిల్లులు రావాల్సి ఉందని, బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులను అర్థాంతరంగా ఆపేశాడు. అలాగే బొల్లారం హై స్కూల్‌కు 30 లక్షల రూపాయలతో రెండు అదనపు గదుల నిర్మాణాలు, పాఠశాలకు మరమ్మత్తులు పనులు మంజూరి కాగా, గదుల నిర్మాణం జరుగగా, 11లక్షల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉండగా మిగతా పనులు నిలిచిపోయాయి. జప్తి జానకం పల్లి యూపీఎస్ పాఠశాలకు 30 లక్షల రూపాయల వ్యయంతో రెండు అదనపు గదుల నిర్మాణం, పాఠశాల మరమ్మతు పనులు మంజూరైయ్యాయి. గదుల నిర్మాణం పనులు జరగ్గా, మిగతా పనులు జరగాల్సి ఉంది. 11 లక్షల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గోలి లింగాల్ యూపీఎస్ పాఠశాలకు 13 లక్షల రూపాయల వ్యయంతో పాఠశాల మరమ్మతు పనులు మంజూరైయ్యాయి. మరమ్మత్తు పనులు కొంత చేపట్టగా 6 లక్షల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలలకు మన ఊరూ - మనబడి నిధుల ద్వారా చేసిన పనులు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు ఆయా గ్రామాల్లో అర్థాంతరంగా నిలిచిపోయి దర్శనమిస్తున్నాయి. పాఠశాలలకు అదనపు గదులు మంజూరైనా, ఈ అదనపు గదుల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించి పనులు పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయా పాఠశాలల విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పథకం

2022-23లో గత బీఆర్ ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మన ఊరు - మన బడి పథకాన్ని ప్రవేశపెట్టింది. సర్కారు బడుల రూపురేఖలను సమగ్రంగా మార్చేందుకు ఉద్దేశించి మన ఊరు - మనబడి కార్యక్రమాన్ని అప్పటి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ స్కూళ్లను అభివృది చేయాలన్న లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, డైనింగ్ హాళ్ల నిర్మాణం, ప్రహరి గోడలు, మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి వసతి కల్పన, విద్యుత్ సౌకర్యం, ఫర్నీచర్ ఏర్పాటు, తదితర పనులను ఈ పథకం ద్వారా చేపట్టారు. 2023 అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు చాలా వరకు ఈ పథకం ద్వారా పనులను చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలై అధికారాన్ని కోల్పోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మన ఊరు - మన బడి పథకం ద్వారా మంజూరైన వివిధ అభివృద్ధి పనులు నిర్వహించిన కాంట్రాక్టర్లకు బిల్లుల మంజూరిలో తీవ్ర జాప్యం జరుగుతోందని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.

చేసిన పనులకు బిల్లులు రాలేవు

● మురళి, కాంట్రాక్టర్, నాగిరెడ్డి పేట



మన ఊరు - మన బడి పథకం ద్వారా మండలంలో మంజూరైన వివిధ పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, మరమ్మత్తు పనులు చేశాను. మండలంలో సుమారు కోటి రూపాయలకు పైగా పనులు చేశాం. వీటి బిల్లులు రావల్సి ఉంది. పనులకు చేసి ఏడాది గడిచినా ఇంతవరకు బిల్లులు రాలేవు. బిల్లులు రాక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చేసిన పనులకు ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలి.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మైనార్టీ జిల్లా సంక్షేమ అధికారి దయానంద్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను మంగళవారం ఆర్ఎల్‌సి కిరణ్‌గౌడ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సవరించిన మెను ప్రకారం ప్రతీరోజు భోజనం, స్నాక్స్, పండ్లు అందించాలని సూచించారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. పాఠశాలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టల్‌కు సంబంధించిన రికార్డులు, విద్యార్థులు ఉపాధ్యాయుల రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో ప్రతిభ చాటి బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహమ్మద్ రఫత్, ఎస్ఎల్‌సి, బోధన, బోధనతర సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నమల్లారెడ్డి బూత్ అధ్యక్షుడి ఎంపిక

కామారెడ్డిటౌన్,డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన బూత్ అధ్యక్షులను ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఎంపిక చేసినట్లు బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి తెలిపారు.గ్రామంలోని 163వ బూత్ అధ్యక్షుడిగా భూమయ్య 164వ బూత్ అధ్యక్షుడిగా సూర్యం, 165వ బూత్ అధ్యక్షుడిగా రామచంద్రం, 166 బూత్ అధ్యక్షుడిగా అంజనేయులు, 167వ బూత్ అధ్యక్షుడిగా చంద్రకాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నల్లబెల్లం పట్టివేత



నల్లబెల్లంను పట్టుకున్న ఎక్సైజ్,రైల్వేపోలీసులు

కామారెడ్డిటౌన్,డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఎక్సైజ్ సిబ్బంది, రైల్వేపోలీసులు కలిసి 100కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో ఈ నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్ఐ విక్రమ్‌కుమార్, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ సుధాకర్, సిబ్బంది మైసరాజు, సంతోష్,ఆంజనేయులు,రాగ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాబృందం

కామారెడ్డిటౌన్,డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అందరికి అర్థమయ్యే విధంగా చాటి చెప్పడమే కళాబృందం లక్ష్యమని రమేష్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న ఆరుగ్యారెంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలకు ఉచిత బస్సుగృహ అవసరాలకు ఉచిత విద్యుత్ రుణమాఫీ,ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలపై ఆటపాటలతో ప్రజలకు వివరించారు. అర్హులైన వారు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాబృందం ప్రశాంత్‌రెడ్డి, మహేందర్, లక్ష్మీనారాయణ,దేవయ్య, నాగరాజు,రాము, విఠల్‌రెడ్డి,సవిత,శిల్ప, లత,దివ్య తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు దొంగ తరలింపు



చోరికి పాల్పడిన నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

లింగంపేట, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమడుగులో ఈనెల 18న చోరికి పాల్పడిన దొంగ గాంధారి మండల కేంద్రానికి చెందిన ర్యాపని ఒడ్డె సాయిలుగా గుర్తించి మంగళవారం లింగంపేట బస్టాండ్ వద్ద పట్టుకుని విచారణ జరిపి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి... నల్లమడుగుకు చెందిన అబ్దుల్ రహీం ఈనెల 18న తన బావమరిది ఇంట్లో ఫంక్షన్ ఉందని లింగంపేటకు వెళ్లగా అదే రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగుళగొట్టి ఇంట్లోని బంగారం, వెండి, నగదును అపహరించారు. ఇట్టి విషయాన్ని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దరఖాస్తు స్వీకరించిన పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించి వేలిముద్రల ఆధారంగా నిందితుడు గాంధారి మండల కేంద్రానికి చెందిన ర్యాపని ఒడ్డె సాయిలుగా గుర్తించి అతని కోసం గాలించగా మంగళవారం లింగంపేట బస్టాండ్ వద్ద అతనిని పట్టుకుని విచారణ జరపగా అతని వద్ద వెండి అభరాణాలు స్వాధీన పరుచుకుని అతనిని డిమాండ్‌కు తరలించారు.

యేసు ప్రభు దీవెనలు అన్ని వర్గాల ప్రజలపై ఉండాలి

● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏసుప్రభు దీవె నలు అన్ని వర్గాల ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రం లోని వికేవి ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వం ఏర్పాటు క్రిస్మస్ విం దుకు ముఖ్య అతిథిగా హాజరై కేక్‌కట్ చేసి విందును ప్రారం భించారు. అంతకుముందు పాస్టర్ ఈ. ప్రభాకర్ ప్రత్యేక ప్రార్థ నలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్టియన్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని క్రిస్టియన్లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యమని త్వరలోనే ఇల్లు లేని పేదలకు ఇండ్లు అందించేందుకు ప్రక్రియ కొనసాగుతుందని అర్హులైన పేదలకు అసైన్డ్, పోడు భూములకు పట్టాలు పొంది రోజులు ముందున్నా యని అన్నారు. అదేవిధంగా కామారెడ్డి నుండి ఎల్లారెడ్డి వరకు ఉన్న ప్రధాన రహదారిని జాతీయ రహదారిగా మార్చాలని అసెంబ్లీలో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రోడ్డుకు మూలమలుపులు ఎక్కువగా ఉండటం వల్ల ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని రోడ్డు భవనాల శాఖ మంత్రికి విన్నవించగా తక్షణమే స్పందించి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని, పేద ప్రజల శ్రేయస్సు ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మన్నే ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ నాయక్, నయాబ్ తహసిల్దార్ చరణ్‌సింగ్, అర్ఐ శ్రీనివాస్, 8 మండలాల పాస్టర్లు జోసఫ్, మాణిక్యం,చారి, భాస్కర్, విజయ్ కుమార్, మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత రెడ్డి, గాంధారి మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేష్, మాజీ జడ్పీటీసీ ఉషాగౌడ్, సర్దార్‌సింగ్ నాయకులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో పలువురు చేరిక

నాగిరెడ్డి పేట: నాగిరెడ్డిపేట మండలం లోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీలను వీడి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వీరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. పోచారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నర్సా గౌడ్‌తో పాటు శ్రీనివాస్ గౌడ్, బాబు, లింగంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కిష్టయ్య, చీనూరు గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ డైరెక్టర్ నారాగౌడ్, బెజుగం చెరువు తండాకు చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ కిషన్ నాయక్‌లతో పాటు ఆత్మకూర్, వాడీ, ఎర్రారం, పోచారం, లింగంపల్లి, చీనూర్ తదితర గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ , బీజేపీ నాయకులు ,కార్యకర్తలు ఆపార్టీలకు గుడ్ బై చెప్పి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలకు తాము ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత వెంకట్‌రాం రెడ్డి, నాగిరెడ్డి పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ , మండల కాంగ్రెస్ నాయకులు రాంచంద్రా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాల్ రెడ్డి , నర్సింహా రెడ్డి, లక్ష్మణ్, ఇమాం, పర్వత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలి

● ప్రభుత్వ సలహాదారుడు పోచారం



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారుడు పోచారం

బాన్సువాడ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని ప్రభుత్వ వ్యవసాయ సలహా దారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ డిమాండ్ చేశారు. ఏఐసీసీ, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాను సారం దేశవ్యాప్త నిరసనలో భాగంగా మంగళవారం బాన్సువాడ పట్టణం లోని అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రజలకు రాజ్యాంగంతో దిక్సూచిని ఏర్పాటు చేసి బలహీన వర్గాలు, పేద ప్రజల్లో వెలుగులు నింపిన అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి పదవిలో ఉన్న అమీత్ షా దళిత వర్గాల మనోభావాలను దెబ్బ తీసినందుకు కేంద్ర మంత్రి పదవి నుం చి తొలగించడమే కాకుండా బీజేపీ నుంచి సైతం ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఖలేఖ్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్,మాజీజడ్పీ కోఆప్షన్ సభ్యులు అలీ బిన్ అబ్దుల్లా, ఎజాస్, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సురేష్‌బాబా, శ్యామల, కృష్ణారెడ్డి, అంజి రెడ్డి, హన్మాండ్లు, హన్మంత్,పవన్,శంకర్, అలీమొద్దీన్, బాబా, షాహబ్, రత్నాకర్, అజీమ్, అఫ్రోజ్, తదితరులున్నారు.

● దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి

పెద్దకొడప్‌గల్(ఆంధ్రజ్యోతి): భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని జుక్కల్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సౌదాగర్ అరవింద్ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావ్ ఆదేశాల మేరకు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి అమిత్‌షా దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతు అంబే ద్కర్ రచించిన రాజ్యాంగం పుణ్యంతో అధికారంలోకి వచ్చిన షా అంబేద్కర్‌పై వ్యాఖ్యలు చేయడం సరి కాదని తెలిపారు. అంబేద్కర్ రాజ్యంగం రచించడం వల్లనే దేశంలో అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా అమిత్‌షా ఈ విషయాన్ని గ్రహించి బేషరతుగా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు హన్మండ్లు, సంగమేశ్వర్, ఖండేరావ్, విఠల్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసహాయం చేస్తున్న చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్,డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి మున్సిపల్‌లో గత 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికుడు పసుల రేవన్ ప్రమాదవశాత్తు మృతిచెందాడు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ బాధిత కుటుంబాన్ని పరామర్శించి బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసహాయం అందించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలోని పెద్ద గుల్ల గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి 7గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. పెద్ద గుల్ల గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేయగా 7గురు వ్యక్తులు పేకాడుతూ.. పట్టుపడ్డారని ఎస్ఐ తెలిపారు. వీరి నుండి 57 వేల 110 రూపాయల నగదుతో పాటు. 3 మోటారు సైకిళ్ళు 7 సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జుక్కల్ మండలంలో పేకాట ఆడుతున్న వారి సమాచారం అందిస్తే అటువంటి స్థావరాలపై దాడి చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయసంఘాల సమాఖ్య కార్యవర్గం ఏర్పాటు



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

కామారెడ్డిటౌన్,డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయసంఘాలసమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. నూతన చైర్మన్‌గా పంపరి ప్రవీణ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దేవ్లా, కోశాధికారిగా పందిరి రాజేష్, కోచైర్మన్‌లుగా రాజ్‌కుమార్, శ్రీనివాస్,రాజేశ్వర్,హన్మంత్‌రెడ్డి,ప్రభాకర్, అరుణ్‌కుమార్, కార్యదర్శులుగా సంతోష్,ముజిబొద్దిన్, రాములు,రమేష్‌గౌడ్, రాములు, నరేందర్,తిరుపతి,స్వామి, సలహదారులుగా యాదయ్య, విజయరామరాజు, రమేష్‌కుమార్‌గౌడ్, గఫూర్‌శిక్షక్, శ్రీశైలంలతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా చైర్మన్ పంపరి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తు సమస్యల సాధనలో కీలకపాత్ర పోషిస్తామని తెలిపారు.తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన వివరించారు.

ఇదెక్కడి 'సహకారం..!'

(5వ పేజీ తరువాయి...)

వసూళ్లకు ఒత్తిడి చేయడం బ్యాంకర్ల వ్యూహంలో భాగమనే సందేహాలు రైతుల్లో, రైతు సంఘాలలో వ్యక్తం అవుతోంది.

రైతులకు బ్యాంకుల నుంచి నోటీసులు

జిల్లాలోనిఆయా సహకార శాఖలో సభ్యులుగా ఉన్న రైతులకు ప్రభుత్వం ప్రతీ ఏడాది రుణాలు ఇచ్చేందుకు పలు ప్రైవేట్ బ్యాంకులతో పాటు ప్రభుత్వ బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశించి బడ్జెట్‌ను కేటాయిస్తుంటారు. సహకార శాఖలో సభ్యులుగా ఉన్న రైతులు శాఖకు అనుబంధమైన సహకార బ్యాంకుల నుంచి వడ్డీలకే రుణాలు తీసుకుని పంట సాగుకు, పాడి పశువుల పెంపకానికో, వ్యవసాయ పనిముట్ల యంత్రాలకు వినియోగిస్తుంటారు. అయితే ఈ రుణాలు రైతులు తీసుకుంటూ వ్యక్తిగత ఇబ్బం దుల వల్ల సకాలంలో కట్టలేక ఆ రుణాలు అలాగే ఉండిపోతున్నాయి. జిల్లాలోని సహకార బ్యాంకులో గత రెండేళ్ల నుంచి స్థానికంగా ఉండే రైతులు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు తీసుకుంటూ వచ్చారు.అయితే మార్చి నెలతో ఆర్థిక సంవత్సరం ముంచుకొస్తుండడంతో ఆయా బ్యాంకర్లు రైతులకు రుణాలు కట్టాలని నోటీసులు జారీ చేస్తున్నారు.

తాకట్టు పెట్టిన భూములకు వేలం

వ్యక్తిగత ఆస్తులు, వ్యక్తిగత పూచికత్తుతో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించని లబ్ధిదారులపై జిల్లాలోని సహకార బ్యాంకులు దృష్టి సారించాయి. సహకార బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఏళ్ల తరబడి చెల్లించకుండా ఉన్న రైతులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు సైతం స్పందించకుంటే రుణం తీసుకున్న సమయంలో తాకట్టు పెట్టిన ఆస్తులను జప్తు చేసి వేలం వేసేందుకు బ్యాంకర్లు చర్యలు తీసుకుంటున్న ట్లు తెలుస్తుంది. దీంతో బకాయి పడిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు వ్యవసాయ రుణాలు, మరికొందరు వాహనాలు, పాడి గేదెల కోసం వ్యవసాయేతర రుణాలను తీసుకుని ఏళ్లుగా బకాయి పడ్డారు. ఇటీవల బాన్సువాడ డివిజన్ పరిధిలోని నస్రూళ్లబాద్ మండలంలోని నస్రూళ్లబాద్, దుర్కి సహకార సంఘాల బ్యాంకుల్లో స్థానిక రైతులు వివిధ రకాల దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారు. దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు రంగంలోకి దిగారు. పరిస్థితులు బాగాలేవని.. కొంత సమయం ఇస్తే వాయిదాల ప్రకారం రుణాలను చెల్లిస్తామని బ్యాంక్ అధికారులకు రైతులు మొర పెట్టుకున్నారు. అందుకు సహకార అధికారులు ఒప్పుకోలేదు. దీంతో ఓ మహిళా రైతుకు సంబంధిం చి మూడెకరాల వ్యవసాయ భూమిని వేలం వేస్తున్నట్లు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఇలా సుమారు 30 నుంచి 40 మంది రైతులకు రుణాల చెల్లింపు కోసం సొసైటీ బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌లో సాగుబడి

భిక్కనూరు, డిసెంబరు 24: బీటీఎస్ చౌరస్తాలో గల టీయూ సౌత్‌క్యాంపస్‌లో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సాగుబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగాక్యాంపస్ ప్రాంగణంలో విద్యార్థులు లేత మల్బరీ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరీచ ఏడీ జ్యోతి, సెరికల్చర్ అధికారి ఐలయ్య మాట్లాడుతూ పట్టుపురుగుల పెంపకం పట్ల అవగాహన కల్పించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భౌతికశాస్త్ర అధ్యాపకురాలు లలిత, జంతుశాస్త్ర అధ్యాపకులు సునీల్, విజయ్‌కుమార్, శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు 90 రోజుల యాక్షన్ ప్లాన్ ఫాలో కావాలి

● జిల్లా ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం

బీర్కూర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు 90 రోజుల యాక్షన్ ప్లాన్ ఫాలో కావాలని జిల్లా ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆయన మండ లకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల అధ్యాపకుల అకాడమిక్ రిజిష్టర్‌ను తనిఖీ చేసి సం తృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై 90 రోజు ల యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు. ప్లాన్‌ను ఫాలో అవుతూ వి ద్యార్థులు అధ్యాపకులు చెప్పిన విధంగా చదువుకోవాలని, కళాశాలకు మంచి రిజల్ట్ తీసుకొచ్చే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. కళాశా లకు రెగ్యులర్‌గా రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహ న్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

లింగంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని మోతె గ్రామానికి చెందిన లాల్‌సారి కిష్టయ్య(46) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకునట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మృతుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని బాధను భరించలేక తన పాత ఇంటిలో చీరతో ఉరివేసుకుని మృతి చెందినట్లు అతని కుమారుడు సాగర్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి ఆహ్వానం

బిచ్కుంద/మద్నూర్,డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బిచ్కుం ద ప్రభుత్వ డిగ్రీకళాశాల,మద్నూర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. బిచ్కుంద డిగ్రీకళాశాలలో 1,అర్థశాస్త్రం 1,మద్నూర్ డిగ్రీకళాశాలలో తెలుగు -1, ఆంగ్లం-1, బాటనీ-1,జువాలజీ-1,కెమిస్ట్రీ- 1 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్ పీజీలో 55శాతం మార్కులు అర్హత కలిగి ఉండాలని తెలిపారు. నెట్,సెట్,పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడునని తెలిపారు. విద్య అర్హత పత్రాలు ఈనెల 27న శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలలోపు బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీకళాశాలలో పమర్పించాలని తెలిపారు.

లయన్స్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు భరత్ కుమార్, పంచాయితీ కార్యదర్శి కవిత, కాంగ్రెస్ నాయకులు షైమద్ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Kamareddy Branch, Dist. Kamareddy agreed to accord Loan to Racharla Santhosha Kumar S/o Racharla Janardhan, Age 42 Yrs Occ: Business, R/o H.No.2-3-116, Sathellay Base, Yellareddy Town and Mandal, Kamareddy (Dist) mortgage of the schedule referred plot property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within (07) days of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.

Hence this notice

SCHEDULE OF THE PROPERTY

That the RCC Roofed house bearing No.4-2-87 to 4-2-95 constructed in Plot No.5 & 6 admeasuring East to West 20 fts, North to South 34 Fts, total admeasuring 680 Sq.Fts equal to 75.55 Sq.Yds or say 63 Sq.Mts, out of which RCC Roofed G.F Plinth area 580 Sq.fts and F.F Plinth Area 580 Sq.Fts situated at Yellareddy Town and Mandal, Kamareddy District, within the limits of Municipality Yellareddy, under the jurisdiction of Regn.Sub dist Yellareddy, District Regn.Nizamabad

Bounded as below

North: 3 fts drain and PWD Road, **South:** 3 fts drain and G.P Road, **East :** Plot NO.4 of Myathari Srinivas, **West:** Open Place of Syed Fajanullah Mohinuddin

Sd/- R. Jagadishwer Rao
B.Com, LLB.,Advocate,
H.No. 6-2-67, Subhash Nagar,
Nizamabad, Ph: 9848094409

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Kamareddy Branch, Dist. Kamareddy agreed to accord Loan to Desaipet Swapna W/o Prashanth, Age 34 Yrs Occ:Business, R/o H.No.5-6-351, NGOs Colony, Kamareddy Town and Mandal, Kamareddy (Dist) mortgage of the schedule referred plot property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within (07) days of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.

Hence this notice

SCHEDULE OF THE PROPERTY

North Part of Open Place bearing G.P.H.No.2-48/1 A Admeasuring of North to South: East side 44'-5" Feet, West side 44'-5" feet, East to West: North Side 42' feet, South side 42' feet, the total area of Plot is 1869 Sq.feet equal to 207.66 Sq.Yards, situated at Jangaon Village of Bibipet Mandal, Kamareddy District, within the limits of Gram Panchayat Janagaon, under the jurisdiction of Regn.Sub dist Domakonda, District Regn.Nizamabad

Bounded as below

North : Grama Panchayat Building, **South:** 6' feet own way, **East :** House of Madduri Durga Reddy, **West:** Open Place of Chandupatla Vijaya

Sd/- R. Jagadishwer Rao
B.Com, LLB.,Advocate,
H.No. 6-2-67, Subhash Nagar,
Nizamabad, Ph: 9848094409


జీవితంపై విరక్తి చెంది యువకుడి ఆత్మహత్య

బీర్కూర్,డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి చెందిన యామ హరీష్ (19) అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన యామ పీరయ్య రెండవ కుమారుడు హరీష్ 10వతరగతి వరకు చదువుకున్నాడు. పదోతరగతి పూర్తి అయ్యాక మూడేళ్ల నుండి జులాయిగా తిరుగుతున్నాడు. మద్యానికి బానిస అయ్యాడు. ఏదైనా పని చేసుకుంటూ బాగా బ్రతకాలని తల్లిదండ్రులు హరీష్‌కు పదేపదే చెబుతున్నారు. హరీష్‌లో ఎలాంటి మార్పు రాలేదు. సోమవారం రాత్రి ఇంట్లో భోజనం చేసి పాత ఇంటికి పడుకో డానికి వెళ్లాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో దూలానికి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.మంగళవారం ఎంతకూ హరీష్ కనపడకపోవ డంతో కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించారు. ఎక్కడా హరీష్ అచూకీ లభించలేదు. పాత ఇంటికి వెళ్లి చూడగా హరీష్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. తల్లిదం డ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

రాజంపేట,డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని ఆర్గోండ గ్రామశివారులో మంగళవారం కారుబైక్ ఢీకోనడంతో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఆర్గోండ గ్రామానికి చెందిన అరవింద్,షేక్‌రఫిక్ మండల కేంద్రానికి పనుల నిమిత్తం వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో తిప్పాపూర్ గ్రామానికి చెందిన కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడనుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - రోటి కప్‌డా రోమాన్స్
దర్శన్ - విడుదల పార్ట్-2
ప్రియా 70 - పుష్ప-2
ప్రియా 35 - బచ్చలమల్లి

బాన్సువాడ

మహేశ్వరి - పుష్ప-2
వెంకటేశ్వర - ఫణి

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

